# శుభ లేఖ

## 'పుష్యమి'

గేటు దగ్గర చప్పు డయింది.

తాపీగా మంచం మీద పడుకుని ఆ రోజు దినపత్రిక చూస్తూ, మరో వైపు టీవీలో పాటలు వింటున్న పినాకపాణి ఆ చప్పుడుకు కిటికీలో నుంచి చూశాడు.

ఎవరో బ్రాహ్మణుడు నిలబడి ఉన్నాడు. తీరు చూస్తే యాచనకు వచ్చినట్లుగా ఉంది.

చొక్కా జేబులో చిల్లర తడుముకుని కూతురు అరవిందను పిలిచాడు.

అరవింద స్కూలుకు వెళ్లే హడావుడిలో ఉంది. ఆ రోజు శని వారం కావడంతో తెల్లని యూనిఫారంలో తెల్ల గులాబీలా ఉంది అరవింద.

"అరవిందా, ఈ డబ్బులు ఆయన కిచ్చి పంపేయ్. శని వారం పొద్దున్నే వచ్చిన వాళ్లను వట్టి చేతులతో పంప కూడదు" అన్నాడు పినాకపాణి.

అరవింద బయటికి వెళ్లగానే మళ్లీ పత్రికా పఠనంలో మునిగి పోయాడు పినాకపాణి.

రెండు నిమిషాల్లో వెనక్కి తిరి గొచ్చింది అరవింద. ఆమె చేతిలో అర్ధ రూపాయి అలాగే ఉంది.

"నాన్నా!" అంది అరవింద.

తలెత్తి చూసి, ఏమి టన్నట్లు కనుబొమ లెగరేశాడు పినాకపాణి.

"ఆయనకు అర్ధ రూపాయి వద్దట, పెద్ద వా ళ్లెవరైనా రమ్మన్నాడు" అర్ధ రూపాయి తిరిగి ఇచ్చేస్తూ చెప్పింది అరవింద.

'అయ్యో, రూపం చూసి యాచకుడు అనుకున్నాను. ఎవరి చిరునామా అయినా అడగడాని కొచ్చాడేమో' అని మనసులో నొచ్చుకుంటూ గేటు దగ్గరున్న బ్రాహ్మణుడి వద్దకు వెళ్లాడు పినాకపాణి.

అతని వయసు యాభై సంవత్సరాల పైనే ఉంటుంది. పంచె కట్టుకుని పైన 'హరే రామ హరే కృష్ణ' అని రాసి ఉన్న పసుపు రంగు శాలువా కప్పుకున్నాడు. నుదుట బొట్టు, మెడలో రుద్రాక్ష మాల, కళ్లల్లో తీక్షణత ఉన్నాయి. కుడి చేతిలో బాగా నలిగిన పుస్తకం ఉంది.

'బహుశా గంటల పంచాంగ మేమో' అనుకుంటూ, "చెప్పండి, ఏం కావాలి?" అనడిగాడు పినాకపాణి.

"అయ్యా, నేను చతుర్వేదాలు చదువుకున్న వాణ్ని. దైవానుగ్రహం లభించక ధన హీనుణ్నిఅయ్యాను. శ్రావణ మాసం దగ్గర పడింది. నా కుమార్తెకు వివాహం నిశ్చయించాను. అమ్మాయికి ఓ చీర అయినా కొని పెడదామని ఇలా యాచనకు బయల్దేరాను. ఎవరికి తోచిన సహాయం వారు చేస్తున్నారు. మీరూ ..." అని అర్థోక్తిగా ఆగి పోయా డతను.

పినాకపాణికి ఆ మాటలు నమ్మాలో వద్దో అర్థం కాలేదు. రెండు రూపాయల నోటు తీసిచ్చాడు.

"అయ్యా! నేను భిక్షగాణ్ని కాను. ఆలోచించండి!" అన్నా డా బ్రాహ్మణుడు.

చర్రున కోపం ముంచు కొచ్చింది పినాకపాణికి. "పిల్లకి చీర కొని పెట్ట లేని వాళ్లు పెళ్లి చేయడ మెందుకు? అయినా ఇచ్చింది పుచ్చుకోవాలి. ఏదో ఇంటి అల్లుడిలా పట్టు బడితే ఎట్లా?" అని ఆగ్రహం వెలి గక్కాడు.

అతను ఆ పుస్తకంలో నుంచి ఓ శుభ లేఖ తీశాడు.

మామూలుగా ఏ ప్రెస్‌లో అయినా ముద్రించే సాధారణ శుభ లేఖ.


పైన పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి బొమ్మ ఉంది. లోపల "జానక్యాః ..." శ్లోకంతో ప్రారంభమై మదర్పిత తాంబూల చందనాది సత్కారాలు స్వీకరించ వలసిందిగా ప్రార్థన వరకూ ఉంది.


యధాలాపంగా ఆ శుభ లేఖను చూశాడు. ఆగస్ట్ నెలాఖరున పెళ్లి.

అప్రయత్నంగా పది రూపాయల నోటు తీసిచ్చాడు పినాకపాణి.

లోపలికి అడుగు పెట్టగానే అతని భార్య కల్పవల్లి అడిగింది "ఏమిటీ - దాన కర్ణుడిలా పది రూపాయల నోటు ఇచ్చి వచ్చారు? నెలాఖరు, గుర్తుందా?" అనడిగింది.

"పోన్లే, బీద వాడు" అని తన పనుల్లో





పడ్డాడు పినాకపాణి.

* * *

ఆత్రుతగా ఆ కవర్ తెరిచిన పినాకపాణికి ఎర్ర ఇంకుతో రాసిన 'అప్లికేషన్ రిజెక్టెడ్' అనే మాటలు తీవ్ర నిరాశ కలిగించాయి.

అప్పటికి పది - పదిహేను రోజుల నుంచి ఆ కవర్ కోసం ఎదురు చూస్తున్నాడు. చివరికి వచ్చింది కాని - తను ఆశించిన చెక్ లేదు అందులో.

వెంటనే అప్లికేషన్ తీసుకుని వెంకట్రావు దగ్గరకు వెళ్లాడు.

"ఏమిటిలా అయ్యింది?" అనడిగాడు బాధగా పినాకపాణి.

"అప్పటికీ అప్లికేషన్‌తో పాటు వెయ్యి రూపాయల కమీషన్ ముందే ఇచ్చి వచ్చాను. ఈ ఎమౌంట్ వస్తే అక్కడ సైట్ తీసుకుందా మనుకున్నాను" చెప్పాడు పినాకపాణి.

"వెధవది - ఈసెక్షన్‌కు వచ్చి నప్పటి నుంచి లోన్ శాంక్షన్ కావడం కష్టంగానే ఉంది. నీదే కాదు - ఇంకా మన ఆఫీసులో చాలా మందివి రిజెక్ట్ చేశారు" అన్నాడు వెంకట్రావు.

"ఏమిటి మార్గం?"

"ఇప్పుడు మేనేజ్‌మెంట్ కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్‌కు మళ్లించారు.అందువల్ల నీ వాటా ప్రావిడెంట్ ఫండ్‌లో ఉండేది తక్కువ. దొంగ మెడికల్ సర్టిఫికేట్స్ తీసి లోన్ తీసుకునే వాళ్లు ఎక్కు వయ్యారని రూల్స్ స్ట్రిక్ట్ చేసినట్లున్నారు. ఓ పని చేయ్

సౌదామిని
పద్మ
నీహారిక
సుందరి
ప్రియ

- అయిదుగురు
మహిళల
జీవన
గమనంలో
ఎదురైన
విచిత్రానుభవాల
కథనం

చంద్రశేఖర్ మల్లాది
సీరియల్
'మంచుతెరలు'
త్వరలో

1995 దీపావళి నవలల పోటీలో
ఎంపికైన సాధారణ ప్రచురణ
నవల!

- సైట్ కొంటున్నట్లు చూపించు!" సలహా ఇచ్చాడు వెంకట్రావు.

"నాకు ఎక్కువ ఎమౌంట్ కావాలి."

"మీ అమ్మాయి పెళ్లని లోన్ అప్లై చేయ్! నీ మొత్తం వాటా సొమ్మే కాకుండా, మేనేజిమెంట్ కంట్రిబ్యూషన్ కూడా కొంత ఇవ్వొచ్చు."

వెంకట్రావు సలహాకు నవ్వాడు పినాకపాణి. "మా అమ్మాయి పెళ్లా? దానికి నిండా పదేళ్లు కూడా లేవు."

"రూల్స్ అంటే నిజం కాదు నాన్నా! మీ అన్నయ్య గారి అమ్మాయిని నువ్వు దత్తత తీసుకున్నావు. ఈ అమ్మాయికి పెళ్లీడు వచ్చింది - చేస్తున్నావు. దట్సాల్!

"మనకు తెలిసిన ప్రెస్ ఉంది. అక్కడ ఓ పాతికో, యాభయ్యో శుభ లేఖలు ప్రింట్ చేయిద్దాం. జత చేసి, అప్లికేషన్ పంపిస్తే రామ బాణంలా పని చేస్తుంది. నీ లోన్ శాంక్షన్ అవుతుంది."

వెంకట్రావు మాటలకు పినాకపాణిలో కొత్త ఉత్సాహం తొంగి చూసింది.

* * *

బజారు నుంచి తిరిగొస్తూ, భార్య కల్పవల్లి తో పాటు 'దేవి ప్రింటింగ్ వర్క్స్'కు వెల్లాడు.

శుభ లేఖలు సిద్ధంగా ఉన్నాయి. కాస్త రియల్ టచ్ కనబడాలని ఖరీదైన శుభ లేఖలే అచ్చేయించాడు పినాకపాణి.

ఆ శుభ లేఖల్లో ఒకటి భార్య కల్పవల్లికి చూపిస్తూ అన్నాడు పినాకపాణి, "చూడూ! అమ్మాయి పెళ్లి కార్డు. పట్టుచీరలూ గట్రా కొనమని అడగకు సుమా!"

ముసిముసి నవ్వులు నవ్వింది కల్పవల్లి.

ఈ లోగా ప్రెస్ యజమాని దగ్గర కొచ్చి, ఓ వ్యక్తి అడిగిన మాట వినబడింది. "అయ్యా! ఏదన్నా శుభ లేఖ ఉంటే దానం చేద్దురూ!"

ఆ మాటలకు కల్పవల్లి, పినాకపాణి ఇద్దరూ ఆసక్తిగా అటు వైపు చూశారు.

కొద్ది రోజుల క్రితం తమ ఇంటికి శుభ లేఖతో యాచనకు వచ్చిన వ్యక్తే -

'చూశారా- చూశారా! నేనా రోజే చెప్ప లేదూ, ఇదో కొత్త రకం మోసం అని? మీ రతగాడి మాట లు చక్కా నమ్మేసి పది రూపాయలు దానం చేశారు. ఊరుకుంటారే - వెళ్లి గట్టిగా నిల దీయండి!' అంది కల్పవల్లి కోపంతో కంఠం వణికి పోతుంటే.

ఆ వ్యక్తి నిశ్చేష్టుడై చూస్తున్నాడు, తేరుకోలేదు.

అడుగు ముందుకు వేద్దా మంటే చేతిలోని శుభ లేఖలు సంకెళ్లుగా మారి అతన్ని బంధించాయి. నిమిషం తర్వాత గొంతు పెగల్చుకుని అన్నాడు పినాకపాణి ,"ధనం కోసం రకరకాల మోసాలు! నేను ఫిలప్ లోన్ కోసం దొంగ పెళ్లి కార్డు వేయిస్తే, ఆయన కూతురు పెళ్లని కడుపు నింపు కుంటున్నాడు. రెండూ మోసాలే - కాని రూపాయకూ, రెండు రూపాయలకూ కూటి కోసం చేసే మోసం మోసమేనా?"

P